క్లుప్తంగా

'స్టాప్ డయేరియా' అందరి బాధ్యత


కొండంపేటలో శానిటేషన్ పనులు చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం : వర్షాకాలంలో డయేరియా ప్రబలే అవకాశాలు ఎక్కువుగా ఉన్నాయని, ఈ వ్యాధిని నియంత్రించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'స్టాప్ డయేరియా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. రాజాం పట్టణంలో కొండంపేటలో స్టాప్ డయేరియా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో క్లోరినేషన్ చేయించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ


స్టూడెంట్ కిట్లతో విద్యార్థులు, తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. బ్యాగ్, పుస్తకాలు, బెల్ట్, తదితర కిట్లను పీఎంసీ చైర్మన్ అప్పలరాము చేతులు మీదుగ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖర్, యూత్ సభ్యులు రామకృష్ణ, శ్రీను, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ


వీల్‌చైర్‌తో దివ్యాంగుడు చింతారావు, రెడ్‌క్రాస్ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో టీ దుకాణం నడుపుతున్న దివ్యాంగుడికి రెడ్‌క్రాస్ సభ్యులు శుక్రవారం వీల్‌చైర్ అందించారు. దివ్యాంగుడు ఎస్.చింతారావు పరిస్థితి గమనించిన రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యలు శ్రీకాకుళానికి చెందిన నంది ఉమాశంకర్‌ను సంప్రదించారు. దీంతో ఉమాశంకర్ సమకూర్చిన వీల్‌చైర్‌ను రెడ్‌క్రాస్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో యాదవ్, గౌరీశ్వరరావు, నవీన్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

టీకాలపై అపోహలొద్దు..


టీకా వేయించుకుంటున్న ఎంపీడీఓ రవికుమార్

బొబ్బిలి రూరల్: వయోజనలకు టీబీ వ్యాధి సోకకుండా ప్రభుత్వం అందిస్తున్న బీసీజీ టీకాను పెద్దలంతా వేసుకోవాలని ఎంపీడీఓ రవికుమార్ సూచించారు. మండలంలోని పక్కి పీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేసి టీకా కోసం వచ్చిన వయోజనులతో మాట్లాడారు. టీకా వేసుకోవడంపై ఎటువంటి అపోహలు వద్దని సూచించారు. రూ. ఆరు వేల విలువైన టీకాను ప్రభుత్వం ఉచితంగా వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల నిషేధం ఎత్తివేయాలి

బొబ్బిలి: ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని ఉత్తరాంధ్ర పురపాలక బిల్ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జీఎం ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జీరో సర్వీస్ బదిలీలు చేపట్టి, 20 శాతం నిబంధనను తొలగించాలని కోరారు.

పంటల పరిశీలన


గోగు పంటను పరిశీలిస్తున్న డాట్ శాస్త్రవేత్తలు

బాడంగి: మండలంలోని గజరాయునివలసలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న గోగు, వేరుశనగ పంటలను విజయనగరానికి చెందిన డాట్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.శ్రీనివాస్, కె.లక్ష్మణ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఏఎంవీ 5,9,10 రకం గోగు, కే 6 కదిరి లేపాక్షి రకానికి చెందిన వేరుశనగ పంటలతో అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. సందర్శనలో వారితో పాటు ఏఓ శిరీష, ఏఈఓ పుష్పలత, వీఏఏ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

సర్కారు బడి పడిపోతోంది..

- గత అకడమిక్ ఇయర్ కంటే తగ్గిన విద్యార్థుల సంఖ్య
- సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయుల పాట్లు
- ప్రభుత్వం మార్పుతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో నిస్సహాయత
- ప్రైవేట్ విద్యాసంస్థల వైపు మొగ్గు


బొద్దాం జెడ్పీ హైస్కూల్

రాజాం: వరుసుగా ఐదేళ్ల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల రోల్ ఈ విద్యా సంవత్సరం (అకడమిక్ ఇయర్)లో గణనీయంగా పడిపోయింది. గతంలో ఎటువంటి ప్రచారాలు లేకపోయినా ప్రభుత్వ పాఠశాలల్లో విపరీతంగా చేరికలు జరిగేవి. నాడు – నేడు పనులతో వసతుల కల్పన, ఆంగ్ల మాధ్యంలో విద్యాబోధన, జగనన్న విద్యాకానుక కిట్ల అందజేత, అమ్మఒడి, ట్యాబ్‌ల పంపిణీ, ల్యాబ్‌ల ఏర్పాటు, డిజిటల్ బోధన, బైలింగ్విల్ బోధన వట్టి పద్ధతులు ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులను ఆకర్షించేవి. వీటికి తోడు సకాలంలో కొత్త టెస్ట్ బుక్‌లు విద్యార్థులకు అందేవి. తొలుత పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఈ పాఠశాలల్లో చేరగా, క్రమేపీ పెద్ద పెద్ద ఉద్యోగుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక తక్కువుగా కనిపిస్తోంది. కొత్తగా చేరినవారి సంఖ్య తక్కువ కాగా, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం మానేసి, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల వైపు దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా ఈ విద్యా సంవత్సరంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల రోల్‌ను గత విద్యా సంవత్సరంతో పాటు సమానంగా నిలబెట్టేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వాస్తవరంగా గత విద్యాసంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరం రోల్ పెరగాల్సి ఉంది. పెరుగదల పక్కన పెడితే ఉన్న రోల్‌ను కాపాడే ప్రయత్నంలో అయ్యవార్లు పడ్డారు.

ప్రభుత్వం మార్పుతోనే..

కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరిన తర్వాత ఈ మార్పు స్పష్టంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో తమ విద్యార్థులను చదివిస్తున్న కాస్తోకూస్తో ఆర్థిక స్థోమత ఉన్న వారి దగ్గర నుంచి ఉద్యోగులు, వ్యాపారులు సైతం తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్లో చేర్పిస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఏమిచేయాలో తోచక తమ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంచుతున్నారు. ఈ అకడమిక్ ఇయర్‌లో ఇంతవరకూ పూర్తి స్థాయిలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లు, పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో కొత్త ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని డైలామాలో పడ్డారు.

రాజాం మండలంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది, ఈఏడాది విద్యార్థుల సంఖ్య ఇలా..

పాఠశాల	2023–24లో విద్యార్థులు	2024–25లో విద్యార్థులు
ప్రభుత్వ ఉన్నత పాఠశాల(రాజాం)	826	775
జెడ్పీ హైస్కూల్ (డోలపేట)	664	576
జెడ్పీ హైస్కూల్ (పొగిరి)	520	513
జెడ్పీ హైస్కూల్ (బొద్దాం)	212	190
జెడ్పీ హైస్కూల్ (కంచరాం)	444	419
జెడ్పీ హైస్కూల్ (దోసరి)	193	191
జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ (సారథి)	206	196

రాజాంలో ఇలా..

రాజాం పట్టణంతో పాటు మండలంలో 36 ప్రభుత్వ ప్రాథమిక, 13 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు (కస్తూరీబా పాఠశాలతో కలిపి) ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 5,760 మంది విద్యార్థులు విద్యను అభ్యసించగా, ఈ విద్యాసంవత్సరంలో ఇంతవరకూ 5020 మంది (కొత్తగా చేరినవారితో కలిపి) మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదువుతున్న చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల టీసీలు ఇవ్వమని పాఠశాలల చుట్టూ తిరుగుతున్నారు.

తోటలు పెంచండి

- ఉపాధి ఏపీఓ హరనాథరావు


అంబఖండిలో కొబ్బరిమొక్కలు పరిశీలిస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి : ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులు తోటలు పెంచుకునే వీలుందని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలోని అంబఖండి గ్రామానికి చెందిన ఎస్. సూర్యనారాయణ సాగుచేస్తున్న కొబ్బరిపంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా ద్వారా రైతుకు 48 మొక్కలు అందించామన్నారు. మూడేళ్ల పాటు రైతుకు పంట సంరక్షణ నిధులు ఉపాధి ద్వారా ఇస్తామని తెలిపారు. మండలంలోని రైతులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ


జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్లు

రేగిడి : జీవామృతంతో పంటలకు మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ కిరణ్ అన్నారు. మండలంలోని ఉంగరాడ యూనిట్ పరిధిలోని సోమరాజుపేటలో కోట్ల నారాయణరావుకు చెందిన పొలంలో వేసిన నవధాన్యాల పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయానికి నవధాన్యాల సాగు చాలా ఉపయోగపడుతుందన్నారు. నవధాన్యాల మొక్కలను కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం జీవామృతం తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు, వీహెచ్ఏ అసిరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సౌకర్యాలు

- ఎమ్మెల్యే బేబినాయన


వైద్యుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే బేబినాయన (ఆర్‌వీఎస్‌కేకే రంగారావు) అన్నారు. సీహెచ్‌సీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమై ఆస్పత్రికి కావాల్సిన నిధులు, అవసరాలను తెలుసుకున్నారు. నేత్ర, ఎముకుల రోగులకు చికిత్స కోసం ప్రత్యేక పరికరాలు, గదులు కావాలని, సిబ్బంది తక్కువగా ఉన్నారని, పాత బిల్డింగ్‌లకు మరమ్మతులు చేపట్టాలని సూపరింటెండెంట్ శశిభూషణరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి కావాల్సిన నిధులను ఏపీఎంఐడీసీ నుంచి తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఆయనతో పాటు వైద్యాధికారులు రామనరేష్, రవిశంకర్, సిబ్బంది ఉన్నారు.

గంజాయి తరలిస్తే చర్యలు

రాజాం సిటీ: గంజాయి అక్రమ రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ డి.మోహనరావు హెచ్చరించారు. పట్టణంలోని బస్టాండ్, వైఎస్సార్ పార్కు, తదితర ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా సమాచారం అందించాలని సూచించారు. ఎక్కువుగా యువత మత్తుకు బానిస అవుతుండడంతో పోలీసు నిఘా ఏర్పాటు చేశామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంతకవిటి : మండల పరిషత్‌కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

ఉదయం 11 గంటలకు ..

బాడంగి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు కుక్కలకు ఉచిత టీకాలు

బొబ్బిలి రూరల్: ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా కుక్కలకు శనివారం ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి ఎల్. విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి పట్టణంతో పాటు మండలంలోని పక్కి, పిరిడి, పెంట పశువైద్యశాలల్లో టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జంతు ప్రేమికులు వినియోగించుకోవాలని కోరారు.

చురుగ్గా పారిశుధ్య కార్యక్రమాలు


సోపేరులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం : మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సోపేరులో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండాలి

- ఏసీ చిరంజీవి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

వంగర: గ్రామాల్లో మహిళా స్వయంశక్తి సంఘాలు ఏ గ్రేడులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాజాం వెలుగు శాఖ ఏరియా కో ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 గ్రామైక్య సంఘాల పరిధిలో ఉన్న 1004 సంఘాలను ఏ గ్రేడులో ఉండే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. మహిళలు జీవనోపాధులు పెంపొందించుకునేందుకు స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎస్ఆర్ఎల్ఎం పరిధి లోకోస్ యాప్‌లో పెండింగ్ వివరాలు పొందుపరచాలని తెలిపారు. నాలుగేళ్లకు సంబంధించిన ఆడిట్‌ను పూర్తి చేసి ఆగస్టు చివరి వారంలో మహాజన సభలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, హెచ్‌డీఐఎఫ్ వంటి రుణాల రికవరీ శతశాతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎంలు మీసాల చక్రపాణి, తెర్లి మంగమ్మ, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, సీసీలు పాల్గొన్నారు.

బీజేపీదే పాపం..

- సీఐటీయూ రాష్ట్ర నాయకుడు తమ్మినేని సూర్యనారాయణ


సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణ

బొబ్బిలి: బీజేపీ ప్రభుత్వం 13 కోట్ల సహారా ఖాతాదారులను మోసం చేసిందని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు తమ్మినేని సూర్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం స్థానిక గంటి ప్రసాద్ స్మారక భవనంలో ఖాతాదారులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం సహారాను ముంచి వేల కోట్ల రూపాయల ఆస్తులను కొల్లగొట్టాలని చూస్తోందని ఆరోపించారు. అమిత్ షా కుమారుడికి ఈ ఆస్తులను దోచిపెట్టే ఆలోచన చేస్తోందని, దీన్ని అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. పేదలు తమ పిల్లల భవిష్యత్ కోసం బాండ్ల రూపంలో డబ్బుని సహారాలో పొదుపు చేసుకుంటే, 12 ఏళ్లుగా బాండ్లను మారుస్తున్నారే తప్ప ఒక్క రూపాయి కూడా ఖాతాదారులను చెల్లించడం లేదన్నారు. ఈ దుర్మార్గానికి చెరమగీతం పాడేందుకు ఈ నెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. బీఎల్ దాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, పి. శంకరరావు పాల్గొని మాట్లాడారు.

ఉపాధి నిధుల వినియోగంలో అవకతవకలు

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి


సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారి

వంగర: ఉపాధి నిధుల వినియోగంలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు తనిఖీ బృంద సభ్యులు వెల్లడించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డ్వామా పీడీ జి. ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 15 రోజుల పాటు 29 గ్రామ పంచాయతీల్లో ఎస్ఆర్‌పీ కె.మన్మధరావు ఆధ్వర్యంలో ఎనిమిది మంది డీఆర్‌పీల బృందం సామాజిక తనిఖీలు చేపట్టింది. గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు రూ.12,87,77,611 మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన 753 పనులకు ఆడిట్ జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో గుర్తించిన అవకతవకలు, నిధుల వెచ్చింపు వంటి అంశాలను గ్రామాల వారీగా సభలో వెల్లడించారు. గ్రామాల్లో ఇళ్లు నిర్మించని వారి పేర్లతో బిల్లులు చెల్లించారని, మస్టర్లపై వేతనదారుల సంతకాలు లేకుండా బిల్లులు అందించారని పలువురు డీఆర్‌పీలు సభలో వెల్లడించారు. కొన్ని గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ కింద పెంపకం చేపట్టిన మొక్కలు లేనట్లు గుర్తించారని, అందుకు అవసరమైన నిధులు మాత్రం ఖర్చు చేసినట్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. మరికొన్ని గ్రామాల్లో మరణించిన వ్యక్తుల పేర్లతో బిల్లులు డ్రా చేశారన్నారు. నీలయ్యవలస, పటువర్ధనం గ్రామాల్లో తక్కువ పనులు చేపట్టడంపై ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లపై పీడీ ఉమామహేశ్వరి మండిపడ్డారు. పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కరణం సుదర్శనరావు, తహసీల్దార్ చిరంజీవి పరాగ్, ఎంపీడీఓ సాల్మాన్‌రాజ్, ఏపీడీలు ఎం.శ్రీనివాసరావు, టి.జనార్ధన, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ కె.భానోజీరావు, ఏపీఓ మర్రాపు సత్యవతి, ఏసీ అలుగోలు చిరంజీవి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌలు రైతుల గుర్తింపునకు చర్యలు


వంగర: మాట్లాడుతున్న ఏఓ కన్నబాబు

- ఏఓ కన్నబాబు

వంగర: గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. మండల పరిధి కొప్పర, కొండచాకరాపల్లి, కొప్పరవలస గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపునకు రైతులతో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు నుంచి భూమి పొందినప్పటికీ, కౌలురైతుకు పంటపై హక్కు ఉంటుందన్నారు. భూమిపై ఎటువంటి హక్కులు సంక్రమించవని స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు మంజూరుకు వెసులుబాటు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఏఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు


రేగిడి : మునకలవలసలో కౌలురైతులకు అవగాహన కల్పిస్తున ఏఓ మురళీకృష్ణ

రేగిడి : మండలంలోని కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందించే ప్రక్రియ జరుగుతోందని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని మునకలవలస రైతు సేవాకేంద్రంలో కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతులు ఈ నెల పదో తేదీ లోగా దరఖాస్తులు రైతు సేవాకేంద్రాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం


రూ.50 వేల ఆర్థిక సహకారం అందజేస్తున్న దాత సాయికృష్ణ

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణంలోని మెయిన్‌రోడ్డుకు చెందిన సుంకరి సాయికృష్ణ, మమత దంపతులు రూ.50 వేల ఆర్థిక సహకారం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్థిక సహకారం డబ్బులను ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ భారీ అంచనా వ్యయంతో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభించినట్లు చెప్పారు. ఒక్క శ్లాబ్ కోసమే దాదాపు రూ.40 లక్షల వ్యయం అవుతోందన్నారు. దాతల సహకారంతోనే ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఇంకా దాతలు ముందుకొచ్చి అయ్యప్ప ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్‌వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కుమార్ ధనూకా, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి


మహిళలకు రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి : మహిళలు తమ ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు సూచించారు. మండలంలోని లచ్చారాయపురంలో మహిళలకు, కిశోర బాలికలకు ఆరోగ్యం పట్ల శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు చక్కగా తినాలని సూచించారు. సమావేశంలో ఏఎన్ఎం టి. మంగమ్మ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.